బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

మర్రిముచ్చాలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, మే 21 : వరంగల్- నల్గొండ- ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని మర్రిముచ్చాలలో బీఆర్ఎస్ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఇచ్చిన ఉద్యోగాలను తమ గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో సైతం అనేక ఉద్యోగావకాశాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని, కాంగ్రెస్ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి కిషన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చదరుపల్లి నర్సింగరావు, యూత్ సీనియర్ నాయకుడు బొడిగం వంశీ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలి

నాగపురిలో డోర్ పోస్టర్లు అతికిస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల, మే 21: ఈనెల 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్ ఆలోచించి ఓటు వేయాలని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ కోరారు. మండలంలోని నాగపురిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయం కోసం ఆయన గ్రాడ్యుయేట్స్‌ను కలిసి తమ పార్టీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణ,గణాలు, వారి ప్రవర్తన, సమాజంలోని అన్నివర్గాల పట్ల వ్యవహరిస్తున్న తీరును విజ్ఞులైన పట్టభద్రులు గమనించి వారి మొదటి ప్రాధాన్యతను రాకేశ్‌రెడ్డికి ఇవ్వాలన్నారు.

రైతు సమస్యలపై చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, మే 21: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని వెంకటేశ్వరగార్డెన్‌లో రైతు సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో రణభేరి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులను, ప్రజలను మభ్యపెట్టి సాధ్యం కాని హామీలు ఇచ్చి తీరా గద్దెనెక్కాక హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని, రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, మహేందర్‌రెడ్డి, వెంకటేశం, పైడిపల్లి శ్రీనివాస్, పృథ్వీరాజ్, తిరుమల, విద్యాసాగర్, చందు, లక్ష్మణ్, సమ్మయ్య, మహేష్కుర్, రామ్‌ప్రసాద్, నాగార్జున, ప్రశాంత్, సంతోష్, అనంతస్వామి, లక్ష్మయ్య, శేఖర్, రాంరెడ్డి, సాయికృష్ణ, భూశంకర్ పాల్గొన్నారు.

హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

సిద్దిపేట టౌన్, మే 21: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి దోనే అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సర్కార్ యువతకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మల్యాల శేషుకుమార్,పుల్లూరి కనకయ్య,మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి

పూజలు చేస్తున్న భక్తులు

సిద్దిపేట టౌన్, మే 21: సిద్దిపేట ఉమాపార్థివ కోటిలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీనరసింహస్వామి జయంతి వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం,అర్చన తదితర పూజలు నిర్వహించారు. నరసింహస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు.

హనుమాన్ స్వాముల శోభాయాత్ర

శోభాయాత్రలో హనుమాన్ స్వాముల నృత్యాలు, విన్యాసాలు

హుస్నాబాద్, మే 21: హుస్నాబాద్ పట్టణంలో హనుమాన్ మాలధారులు మంగళవారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. హుస్నాబాద్‌లోని స్థానిక హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర మల్లెచెట్టు చౌరస్తా, మెయిన్‌రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, నాగారం రోడ్డు నుంచి తిగిరి హనుమాన్ దేవాలయం వరకు చేరుకుంది. శోభాయాత్రలో భారీ హనుమాన్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపులో పాల్గొన్నారు. హనుమాన్ స్వాముల విన్యాసాలు, ఆటపాటలు, భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హనుమాన్ గురుస్వాములు, హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

చేర్యాలలో హనుమత్ యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమత్ యజ్ఞం

చేర్యాల, మే 21 : పట్టణంలోని శంఖు చక్రదారి హనుమాన్(రజకనగర్) ఆలయంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో హనుమాన్ మాలధారలు హనుమత్ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన హనుమాన్ స్వాములు, భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి వారి ఆలయంలో వేదపండితులు యజ్ఞంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



చౌదర్‌పల్లిలో శంకర్ కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



జాలిగామలో ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, మే 21: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లిలో ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత బుడిగె శంకర్‌గౌడ్ కటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ప్రమాదబీమాకింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పడిగె రాజు, మాజీ ఉపసర్పంచ్ పొద్దుటూరి శ్రీనివాస్ గుప్తా, తుమ్మ గణేశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకునేదే బీఆర్ఎస్

గజ్వేల్, మే 21: ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకునే ఏకైక పార్టీ దేశంలోనే బీఆర్ఎస్ అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంని జాలిగామ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుమ్మరి కనకయ్య కొద్ది రోజుల క్రితం కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. మృతుడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్నందున అతని కుటుంబీకులకు మంగళవారం రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో 97,500 సభ్యత్వాలు కలిగి ఉన్నామని, పార్టీకి గజ్వేల్‌లో కార్యకర్తలు బలంగా ఉన్నారన్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన 344 కుటుంబాలకు రూ. 6.80 కోట్ల విలువైన బీమా చెక్కులను అందజేశామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, రాజిరెడ్డి, స్వామి, ఆంజనేయులు, రమేశ్‌గౌడ్, ఎల్లం, అశోక్, రాము, శివ్వయ్య పాల్గొన్నారు.

సమయానుకూలంగా వైద్యసేవలు అందించాలి

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాస్

సిద్దిపేట, మే 21: ప్రజలకు సమయానుకూలంగా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మహిళా కార్యకర్తలకు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు, పరీక్షలు,ప్రమాదకర లక్షణాలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సేవలు, పిల్లలకు 100% వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రోగ్రామ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వినోద్‌బాబ్జి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రజిని ,డాక్టర్ విజయరాణి , మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, మే 21: గజ్వేల్ పట్టణ సమీపంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్తీ, పల్లె దవాఖానలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని బస్తీ దవాఖాన, ఎటిగడ్డకిష్టాపూర్‌లోని పల్లె దవాఖానలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను డాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, ఫార్మసీ స్టోర్‌లో నిల్వఉన్న మందులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.



ధూళిమిట్టలో రేణుకాఎల్లమ్మకు బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో బోనాలు

మద్దూరు(ధూళిమిట్ట), మే21: ధూళిమిట్ట మండల కేంద్రంలో రేణుకాఎల్లమ్మ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రేణుకాఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా అర్పించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నాగవెళ్లితో పాటు పెద్ద పట్నం వేసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. రేణుకాఎల్లమ్మ గౌడ అసోసియేషన్ అధ్యక్షుడు నాచగోని గణేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి కనకయ్యగౌడ్, నాచగోని రాములుగౌడ్, కార్యదర్శి తాళ్లపల్లి నర్సయ్యగౌడ్, సహాయ కార్యదర్శి నాచగోని శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి నాచగోని కిష్టయ్యగౌడ్, సలహా సంఘం సభ్యులు నాచగోని నరహరిగౌడ్, నాచగోని వెంకట్‌గౌడ్, నాచగోని లక్ష్మణ్‌గౌడ్, కోల సత్తయ్యగౌడ్ కార్యవర్గ సభ్యులు బూర్గు అశోక్‌గౌడ్, నాచగోని విజయ్‌కుమార్‌గౌడ్, గొల్లపల్లి రమేశ్‌గౌడ్, లింగాల రాములుగౌడ్ పాల్గొన్నారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్, మే 21: హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వర గుట్టపై ఉన్న శ్రీ సంతోషీమాత దేవాలయం 15వ వార్షికోత్సవం మంగళవారం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయం ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు కనుల పండువలా జరిగాయి. అమ్మవారికి అభిషేకం, గణపతిపూజ, నవగ్రహ పూజ, పుణ్యావచనం, లక్ష్మీహోమం, లలిత సహస్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, గౌరిశెట్టి ప్రకాశ్, లక్కిరెడ్డి తిరుమల, కొండూరు శ్రీనివాస్, కవ్వ వేణు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపులపై దాడులు

సీజ్ చేసిన ఇసుక డంపును చూపిస్తున్న పోలీసులు

మద్దూరు(ధూళిమిట్ట), మే21: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో ఇసుక అక్రమ డంపులపై మంగళవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను డంపు చేశారని నమ్మదగిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 150 టన్నుల ఇసుకను సీజ్ చేసి, మద్దూరు పోలీసులకు కేసు అప్పగించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసినా జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయించిన వ్యక్తుల సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందించాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా

ఉమ్మడి మద్దూరు మండలంలోని కమలాయపల్లి చెరువు నుంచి కొంతకాలంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పగలు, రాత్రి అనే తేడాలేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామం నుంచి సమీప పట్టణాలైన సిద్దిపేట, చేర్యాల తదితర పట్టణాలకు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. మరికొంతమంది అక్రమార్కులు తమ వ్యవసాయ బావుల వద్ద ఇసుకను డంపు చేసుకొని దశల వారీగా అమ్ముకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కమలాయపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



హుస్నాబాద్: న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



చేర్యాల: చేర్యాలలో రాజీవ్‌గాంధీ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

కొమురవెల్లి, మే 21: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం కొమురవెల్లిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, సనాది భాస్కర్, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, స్వాములపల్లి రమేశ్, బ్రహ్మండ్లపల్లి చంద్రం, పబ్బోజు రాములుచారి, ఎక్కలదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, మే 21 : పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ఆడెపు నేందర్, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, ముస్త్యాల కిష్టయ్య, పాల లక్ష్మీనారాయణ, దాసరి శ్రీకాంత్, నీలం సన్నీ, పోతుగంటి ప్రసాద్, అంబాట రాముగౌడ్, భూమిగారి మనోహర్, మమిడాల నాగరాజు, నర్ర కేశవులు, మేడిచెల్మి రాకేశ్, రేకులపల్లి సాయికుమార్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ఆధ్వర్యంలో..

హుస్నాబాద్, మే 21: భారత మాజీ ప్రధానమంత్రిరాజీవ్‌గాంధీ వర్ధంతిని అమెరికాలోని న్యూయార్క్‌లో గల టైమ్స్ స్క్వేర్ వద్ద రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలోజరిగింది. రాజీగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్ వల్లపు రాజు, నాయకులు మడప యాదవరెడ్డి, వెన్న రాజు, బత్తుల రవీందర్, దండి కొమురయ్య, సంగ కుమార స్వామి, దుబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ..

గజ్వేల్, మే 21: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గజ్వేల్‌లోని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, నాయకులు జంగం రమేశ్, సమీర్, రెగొండ, మల్లారెడ్డి, కన్నా పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు



మిరుదొడ్డిలో పాఠశాలలకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మహేశ్

మిరుదొడ్డి, మే 21: ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ మహేశ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ బుక్స్‌ను మంగళవారం ఆయా పాఠశాలలకు ఎంఈవో కార్యాలయం నుంచి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో కలిపి 54 పాఠశాలల్లో 3,614 మంది విద్యార్థులు ఉండగా 18,103 నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది కిష్టయ్య, మతిన్ పాల్గొన్నారు.

చర్యలు చేపట్టాలి

సిద్దిపేట అర్బన్, మే 21: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను అధిగమించి చర్యలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలికేరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. కొనుగోళ్లు వేగవంతం చేసి.. పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కేంద్రాల్లో టార్పాలిన్, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు దుబ్బాక మండలం హబ్సీపూర్, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీశ్ పాల్గొన్నారు.

అర్హత సాధించిన విద్యార్థులు

నారాయణరావుపేట, మే 21 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని గుర్రాలగొంది ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. ఈ మేరకు గత సంవత్సరం నిర్వహించిన పరీక్షకు హాజరైన నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎస్‌కు అర్హత పొందారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో జక్కిరెడ్డి కావ్య, ద్వితీయ స్థానంలో సందిరి హర్షవర్ధన్, 5వ స్థానంలో పడిగె ఐశ్వర్య, 23వ స్థానంలో అక్షిత అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు.

జీలుగ విత్తనాల కొరత

మద్దూరు(ధూళిమిట్ట), మే 21: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో జీలుగ విత్తనాల కొరత ఏర్పడింది. భూసారం పెంపునకు జీలుగ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రభుత్వం కొంత కాలంగా ప్రచారం చేస్తున్నప్పటికీ దానికి అనుగుణంగా జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారు. 30కిలోల జీలుగ విత్తనాల బ్యాగుకు రూ. 2790 ఉండగా ప్రభుత్వం రూ. 1674 రాయితీతో రైతులకు రూ. 1116లకు అందిస్తుంది. జీలుగ విత్తనాలను ప్రభుత్వం ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నది. మద్దూరు, ధూళిమిట్ట మండలాల పరిధిలోని రైతులకు సుమారు 10 నుంచి 15 టన్నుల జీలుగ విత్తనాలు కావాల్సి ఉండగా రెండు మండలాలకు నాలుగు టన్నుల జీలుగ విత్తనాలను కేటాయించి, ప్రస్తుతం మూడు టన్నుల జీలుగ విత్తనాలను సరఫరా చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొన్నది. జీలుగ విత్తనాలు అరకొరగా ఉండడంతో మద్దూరు ఆగ్రోస్ కేంద్రానికి రైతులు ఎగబడుతున్నారు.

అందుబాటులో విత్తనాలు

చేర్యాల, మే 21 : మండలంలోని రైతులకు కావాల్సిన వరి, పెసరు విత్తనాలు పట్టణంలోని ఆగ్రోస్2లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఆప్రోజ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.విత్తనాలు కావాల్సిన రైతులు 4కిలోల పెసరు విత్తనాల బ్యాగుకు రూ.480, ఆర్ఎన్ఆర్ 15048 రకం వరి విత్తనాలకు రూ.1110, కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలకు రూ.1000 చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు ఎదురుగా ఆగ్రోస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న టెట్

సిద్దిపేట అర్బన్, మే 21 : జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో రోజు టెట్ సజావుగా కొనసాగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 50 మంది అభ్యర్థులకు .. 43 మంది హాజరై.. 7 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 50 మంది అభ్యర్థులకు.. 48 మంది అభ్యర్థులు హాజరై.. ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షను కళాశాల ప్రిన్సిపాల్ వీపీ రాజు, ఇతర అబ్జర్వర్లు పర్యవేక్షించారు.

పనులు పూర్తి కావాలి

కొండపాక(కుకునూరుపల్లి), మే 21 : పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అదనపు సంచాలకుడు రమేశ్ అన్నారు. మంగళవారం కొండపాక మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిసి నగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కనీస వసతుల సనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆయా స్కూళ్ల హెచ్ఎంలు ఉన్నారు.